

# పీ. శివశంకర్ గారి జీవిత చరిత్ర










( సీరియల్ 11వ భాగం)

**-శివ శంకర్ గారు జూనియర్ లాయర్ గానే బిసి రిజర్వేషన్ల విషయంలో ప్రదర్శించిన పట్టుదల**

**-బీసీల కోసం నేనేం చేశాను ! శివశంకర్ గారు ప్రశ్నించుకున్నారు !!**

ప్రజా స్వేచ్ఛ సిద్దిపేట

అమృతసర్ లో డిగ్రీ తీసుకొని శివశంకర్ గారు 1949లో హైదరాబాద్ కి తిరిగి వచ్చారు. వచ్చిన వెంటనే చేసిన పని - ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో దరఖాస్తు చేశారు. 1952లో వారికి లా డిగ్రీ వచ్చింది. వెంటనే హైదరాబాద్ హైకోర్టు బార్ కౌన్సిల్లో లాయర్ గా నమోదు చేయించుకున్నారు. వారు కోరుకున్న బిఏ (ఆనర్స్) అమృత సర్ నుంచి తీసుకున్నారు. కానీ వారికి అత్యంత ప్రియమైన వారి పెద్దన్న 'జగనన్నని' కోల్పోయారు. అందరు అన్నదమ్ముల్లోకి వారి ఇద్దరి మధ్య ఒక అవినాభావ సంబంధం ఉండేది. కారణం ఇద్దరు ఒకే రకమైన జీవిత విలువలను పంచుకున్నారు. వారు తపించిన విలువల్లో ఇద్దరు కోరుకున్నది ఒకటి ఉంది. బలహీనవర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి.. శివశంకర్ గారి అన్న జగన్ గారు చనిపోయాక అది వారి గుండెల్లో మరింత బలంగా నాటుకు పోయింది. జగన్ గారు శివ శంకర్ గారికి మార్గదర్శి, అతని తపన, ఆరాటం, లక్ష్యం నెరవేర్చాలన్న తహతహ శివశంకర్ గారిలో పెరుగుతూ వచ్చింది. జగనన్న శివశంకర్ గారి కళ్ళముందు లేడు. ఇక ఎప్పటికీ శివశంకర్ గారికి కనపడడు, అయితే ఏంటి జగనన్న గుండె చప్పుడు శివశంకర్ గారికి ఎప్పటికీ వినపడుతూనే ఉంది. తన ఆర్తి జ్వాలలు శివశంకర్ గారి గుండెల్లో మండుతూనే ఉన్నాయి.

1952లో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో లాయర్ శ్రీహరి రావు దేశ్ పాండే గారికి జూనియర్ గా శివశంకర్ గారు చేరారు. రాజ్యాంగం చట్టాల మీద ఆసక్తి కొద్ది, సీనియర్ గారి కేసుల చిట్టాలో అలాంటి కేసులు ఏవైనా ఉంటే తీసుకొని అధ్యయనం చేస్తుండేవారు అలా రాజ్యాంగం, రాజ్యాంగ సంబంధిత చట్టాలు శివశంకర్ గారు అధ్యయనం చేస్తున్న కొద్దీ వారికి అర్థమవుతూ వచ్చిన విషయం ఏమిటంటే ! స్వతంత్ర భారత దేశంలో మొదటి నుంచి బీసీలు మోసపోతూ ఉన్నారు. రాజ్యాంగంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల రిజర్వేషన్ల విషయం స్పష్టంగా నిర్వచించారు. బీసీల విషయంలో అలా జరగలేదు. వాళ్లు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు అని నిర్వచించారే తప్ప అందుకు తగినట్లుగా వాళ్ళకి చట్టపరమైన రాజ్యాంగపరమైన ఆసరా మాత్రం లభించలేదు.

**వాళ్లు తమ వెనుకబడిన స్థితి ఎలా అధిగమిస్తారు ?**

రాజ్యాంగంలో ఒక వెసులుబాటు ఉంది. దాని ప్రకారం "భారత సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా విద్యాపరంగా, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా సదుపాయాలు కల్పించదలిస్తే, అందుకు రాజ్యాంగంలోని ఈ అధికరణం గానీ అధికరణం 29వ గల నిబంధన గాని అడ్డుపడవు". అంతే ! అలా చెప్పి వదిలేసారే గాని బీసీల స్థితిగతులు మెరుగు పడటానికి ఎటువంటి కార్యాచరణాన్ని రాజ్యాంగం సూచించ లేదు. బీసీల కర్మని రాష్ట్ర ప్రభుత్వానికి వదిలేశారు. శివ శంకర్ గారు లా విద్యార్థిగా ఉన్నప్పుడే రాజ్యాంగంలో ఈ వెలితిని గమనించారు. వారు 'లా' పట్టా తీసుకొని, లాయర్ గా ప్రపంచం చూడటం మొదలుపెట్టాక, క్రమంగా ఈ వెలితి ఎలా కోట్లాదిమంది బీసీలకు అవకాశాలను దూరం చేస్తుందో తెలుస్తున్న కొద్ది వారిలో ఒక కసి పెరగసాగింది. వారు ఎలాగైనా బీసీలు ఎస్సీలు ఎస్టీలకు వాళ్ళ జీవన ప్రమాణాలు పెరిగేలా అవకాశాలు కల్పించేందుకు శ్రమించాలన్న ఆత్రుత వారిలో పెరుగుతూ వచ్చింది.

**ఎక్కడ మొదలు పెట్టాలి ?**

లాయర్ గా వారు ఏం చేయగలరో దానిని మొదలు పెట్టాలి అనుకున్నారు. ఒక్కసారి ఈ స్పష్టత వారికి వచ్చిన తర్వాత యువ లాయర్ గా ఉన్న రోజుల నుంచి వారి జీవన ఆశయాలు రెండే రెండు ఒకటి ఒక మంచి లయర్ గా గుర్తింపు పొంది న్యాయమూర్తి కావడం. రెండోది రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక సమానత్వం సాధించే దిశగా పోరాటం చేయాలి. అప్పటినుంచి వారి ప్రతి ఆలోచన ప్రతి అడుగు అటువైపే నడుస్తూ వచ్చాయి. ఆ లక్ష్యానికి వారు బానిస అయిపోయారు. వారు మొదట చేసిన ఉద్యోగంలో బాస్ శ్రీ మాడపాటి హనుమంతరావు గారి పనితీరుతో చాలా ఆనందపడ్డారు. ఆయన నగర మేయర్ గా పనిచేసినప్పుడు శివశంకర్ గారు ఆయనకి పర్సనల్ అసిస్టెంట్ గా మాత్రమే కాకుండా ఒక న్యాయ సలహాదారు వంటి పాత్ర కూడా పోషించారు. ఆయనకే ఆధార పడదగిన సేవ సలహాలను శివశంకర్ గారు అందించడం ద్వారా వారి మెప్పు పొందారు. ఆ రోజుల్లో కేంద్ర ప్రభుత్వంలో ఒక బీసీల జాబితా ఉండేది. కానీ అప్పటికి హైదరాబాద్ రాష్ట్రం ఇంకా భారత రిపబ్లిక్ లో విలీనం కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ చట్టాలకి నిజాం ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదు శివశంకర్ గారి అభ్యర్థన మీద మాడపాటి హనుమంతరావు గారు (భారత్ లో హైదరాబాద్ విలీనం తర్వాత) ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారిని కలవడానికి అవకాశం కల్పించారు. హనుమంతరావు గారి మాటకి బూరుగుల రామకృష్ణారావు గారు ఎంతో విలువనిచ్చేవారు.

అసలు బూర్గుల వారిని న్యాయవాద వృత్తి వదిలేసి ప్రజా జీవితంలోకి రమ్మని ఒప్పించిందే మాడపాటి హనుమంతరావు గారు. బలహీనవర్గాల ప్రయోజనాల గురించే ఆలోచించడంలో శివశంకర్ గారితో బావ సారూప్యం ఉన్న మరికొంతమంది మిత్రులతో కలిసి ముఖ్యమంత్రి బూర్గులను వారి కార్యాలయంలో కలిశారు. వెనుకబడిన తరగతులకు సంబంధించి రాజ్యాంగంలో ఏమని ఉందో వివరిస్తూ, దాని ప్రకారం హైదరాబాద్ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలను గుర్తించి, అర్హులైన కులాలతో రాష్ట్ర జాబితా ఒకటి తయారు చేయించి ప్రకటించాలని వారు వినతిపత్రంలో కోరారు. కొన్ని మాసాలు గడిచాయి. వారి అభ్యర్థన మీద ఎలాంటి పురోగతి కనిపించలేదు. వారు మళ్లీ వెళ్లి ముఖ్యమంత్రి గారిని కలిశారు. మరోసారి వారి అభ్యర్థన నొక్కి చెప్పారు. ముఖ్యమంత్రి గారు నిజాయితీగా ఒక విషయం చెప్పారు. " మీ అభ్యర్థన చదివానయ్యా , కానీ మీ అభ్యర్థన అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలు (కేంద్రం ఇచ్చినవి) ఏవి లేవు. పని ఎలా మొదలు పెట్టాలి ?... ఈ మధ్యలో - 1953లో కేంద్ర ప్రభుత్వం ఒక కమిషన్ ను నియమించింది. ఎస్సీలు, ఎస్టీలు కాకుండా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులను నిర్వచించటం ఈ కమిషన్ లక్ష్యం. కాకా కలేల్కర్ చైర్మన్ గా వెనుకబడిన తరగతుల కమిషన్ అవతరించింది. శ్రీ కలేల్కర్ గారు స్వాతంత్రం తొలి సమరయోధుడు. " మహాత్మా" గాంధీకి దగ్గరి అనుచరుడు, అందుకే ముఖ్యమంత్రితో మేము చెప్పాం :ష్ణారావు గారు చాలా సానుకూలంగా స్పందించారు. ఆ మార్గదర్శక సూత్రాల ఆధారంగా చాలా వేగంగానే రాష్ట్ర ప్రభుత్వం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల జాబితాను వెలువరించింది. కలేల్కర్ కమిషన్ దేశమంతా పర్యటించి, అన్ని రాష్ట్రాల్లో ఉన్న వెనుకబడిన కులాలను గుర్తిస్తూ 1955లో తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ జాబితా పై తన నిర్ణయాన్ని నాన్చి నాన్చి చివరికి 1961లో తిరస్కరించింది. చాలావరకు వెనుకబడిన తరగతులనేవి వాళ్ల వాళ్ల కులవృత్తులు ఆధారంగా నిర్ణయించబడ్డాయి. అప్పటికి రాష్ట్రం మూడు ప్రాంతాలుగా ఉండేది. అవే తెలంగాణ, మరాఠ్వాడ, కర్ణాటక ఆ మూడు ప్రాంతాల్లోనూ ఇలాగే కులవృత్తులు ఆధారంగా బీసీల జాబితా తయారయింది. ఉదాహరణకి తెలంగాణలో తాటికల్లు తీసే వారిని "గౌడ్" అంటారు. ఇదే వృత్తిలో ఉన్న వాళ్ళని మరాఠ్వాడా, కర్ణాటకలలో భండారి, కలాల్, ఈడిగ అంటారు. ప్రభుత్వ జాబితా ప్రకారం - వీళ్లంతా బీసీలే, వాళ్లందర్నీ ఒకే గ్రూపులోకి తీసుకువచ్చింది ప్రభుత్వం. ఇలా చేయటంలో ఏం జరిగిందంటే - ఒకే కులవృత్తిలో ఉన్నవాళ్లు ఒక ప్రాంతంలో సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెంది ఉన్నా, అదే వృత్తి వాళ్ళు మరొక ప్రాంతంలో వెనుకబడి ఉన్నారు. కానీ, ఆ వృత్తిని బట్టి మాత్రం ఆ కులం రాష్ట్రస్థాయి జాబితాలో వెనుకబడిన కులం గానే ప్రకటించబడింది.

ఉదాహరణకి మున్నూరు కాపుల విషయం తీసుకుందాం. వీళ్ళు తెలంగాణలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వ్యవసాయదారులు. కానీ మరాఠ్వాడాలో మున్నూరు కాపులు బాగా అభివృద్ధి చెందిన కులస్తులు. ఇదే సమయంలో - మరాట్వాడాలో తోటమాలి వృత్తిలో ఉండే - మహాత్మా జ్యోతిరావు పూలే వంటి వాళ్ళు వ్యవసాయదారులు కారు. కానీ, వ్యవసాయ అనుబంధ రంగమైన ఉద్యానవన రంగంలో పని చేస్తున్నారు. అన్న కారణంతో వాళ్లని తెలంగాణలోని మున్నూరు కాపులతో సమానం చేశారు. తరువాయి భాగం రేపటి సంచికలో

# శ్రీ చైతన్య కాలేజ్ విద్యార్థిని ఆత్మహత్య యత్నం ఘటన పై విచారణ చేపట్టాలి

**ప్రజా స్వేచ్ఛ - ఎల్బీనగర్ ప్రతినిధి:**

చైతన్యపురి బ్రాంచ్ శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న వేణు శ్రీ అనే విద్యార్థిని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన దురదృష్టకరమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సంఘటన పై సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం కు సంబంధించిన వివరాలను సేకరించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చైతన్యపురి శ్రీ చైతన్య కాలేజ్ తమకు అనుమానం ఉన్నదని తల్లిదండ్రులు పైసా పైసా పోగు చేసి తమ పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలని ఆశతో గొప్ప కళాశాలలో చేర్చి ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలని తాపత్రయ పడుతుంటారని, కళాశాల యాజమాన్యం



లక్షల రూపాయలు ఫీజుల రూపంలో ముక్కు పిండి వసూలు చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల ఆశలను వ్యాపారంగా మార్చుకుంటున్నాయన్నారు, కొన్ని విద్యాసంస్థల యాజమాన్యానికి కనీసం పిల్లలను జాగ్రత్తగా చూసుకునేంత శక్తి లేదని వారన్నారు,హాస్టల్లో ఉన్న ఇన్చార్జిలు ఈ ఘటన జరుగుతుంటే ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు,ఓమ్ని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వేణుశ్రీ కీ మెరుగైన వైద్యం అందివ్వాలని కాలేజి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి అరుణ్ కుమార్ గౌడ్ సహాయ కార్యదర్శి వినోద్, హయత్ నగర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జిన్నా బన్నీ, వైస్ ప్రెసిడెంట్ ఏన్నపల్లి ఉపేందర్, జాయింట్ సెక్రెటరీ జూనోతల భాను ప్రకాష్ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# జై కుమ్మర జైజై కుమ్మర

## కుమ్మరన్న కదలిరా, దీక్ష భూని తరలిరా

**-రాగి బిందెలో బోనం రాష్ట్రానికి అరిష్టం**
**-ఇత్తడి బిందెలో బోనం ఇంటింటికి అరిష్టం**
**-స్టీలు బిందెలో బోనం స్త్రీ లందరికి అరిష్టం**
**-మట్టి కుండలో బోనం అమ్మవారికి శ్రేష్ఠం**







**ప్రజా స్వేచ్ఛ - ఎల్బీనగర్ ప్రతినిధి:**

తెలంగాణ కుమ్మర్ల సామాజిక సాంస్కృతిక కళా వైభవం చాటి చెప్పే విధంగా చేపట్టే బోనం విశిష్టత ఎంత గొప్పది, అమ్మవారకి ఎంతో ప్రీతికరమైన కొత్త మట్టి కుండలో అన్నం వండి, ఆ అన్నాన్ని కుమ్మర్ల చేత అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం వల్ల, అమ్మవారు అనుగ్రహించి కోరిన కోర్కెలు నెరవేర్చుతుందని సనాతన ధర్మం చెపుతుంది, నేటికి మనం ఈ సాంప్రదాయాన్ని ఆచరిస్తున్నాము, ఆశాడ మాసంలో ఈ బోనాల పండుగనను ఘనంగా జరుపూకుంటున్నారు, క కల్యాణం కోసం, యావత్ ప్రజానికం ఆయురారోగ్యలతో, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ,అమ్మవారికి ఆశాడ మాసంలో మొదటి పూజ చేసి,తమ ఇంటి ఆడపడుచుగా కొలుచుకొనే అమ్మవారికి తొలి బోనం సమర్పించే సంప్రదాయ పరంపరను నేటికి కొనసాగిస్తున్నారు. ఈ పరంపరకు అను బంధంగా ,తేదీ 21-07-2024 ఆదివారం ఉదయం 11గంటలకు అమ్మవారికి తొలి బోనం ఎక్కించే మహత్తరమైన దైవ కార్యక్రమాన్ని లిమన్సురాబాద్ కుమ్మరసంఘం ఆద్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరసంఘం కార్యవర్గ సభ్యులు మరియు, స్థానిక నాయకుల కలయికతో, డప్పుల చప్పుళ్ళతో,పోతరాజు నృత్య విన్యాసాలతో,శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా మా కుమ్మర మహిళా ఆడపడచులు తమ ఇంటి ఇలవేలుపు ఐన, అమ్మవారికి 51 బోనాలను, సామూహిక ఊరేగింపుగా అమ్మవారు తమ ఇంటి ఆడపడుచుగా భావించి, మట్టి కుండలో తొలి( బోజనం) బోనం సమర్పించడం జరుగుతుంది. మట్టి కుండలోనే అమ్మవారికి బోనం సమర్పించాలి అనే నినాదం ఈ సమాజానికి చేరాలని , గ్రామా దేవతల దేవాలయలలో కుమ్మర్లనే పూజారులుగా నియమించే విధంగా విడుదల చేయావలిసిందిగా కోరుతూ, ఈ సందేశం ప్రభుత్వానికి చేరాలన్న సంకల్పంతో, నిర్వహిస్తున్న కుమ్మర్ల తొలి బోనం జాతరలో, లిమన్సురాబాద్ చుట్టుపక్కల ఉన్న ప్రతి ఒక్క కుమ్మర సోదర సోదరీమణులు కులబందువులందరు పాల్గొని మన హక్కులను మనమే సాదింకోవలన్న లక్ష్యానికి ఊపిరిని ఇవ్వవలసిందిగా కోరుకుంటు, ఈ కార్యమాన్ని విజయవంతం చేయవలసింది గా కోరుతున్నాము. మా ఆడపడుచులందరు సామూహికంగా అమ్మవారికి కుమ్మర్ల తొలి బోనం సమర్పణ కార్యక్రమంలో పాల్గొని, ఈ దైవ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. ఇట్లు మన్సురాబాద్ కుమ్మరసంఘం

# శ్రీ క్రోధి నామ సంవత్సర ఆషాడశుద్ధ పౌర్ణమి ఆదివారం రోజున ముఖ్యఅతిథిగ తరిగొప్పుల మహేందర్ గారు తరిగొప్పుల అమరేందర్ గారూ విచ్చేశారు



**ప్రజా స్వేచ్ఛ - ఎల్బీనగర్ ప్రతినిధి:**

శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సాయి నగర్ కాలనీ సాయిబాబా మందిరంలో నాగోల్ రోడ్ నెంబర్ 4 లో గురు పౌర్ణమి మహోత్సవము స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ క్రోధి నామ సంవత్సర ఆషాడశుద్ధ పౌర్ణమి ఆదివారం రోజున కాగడ హారతి విశేష అభిషేకం అర్చన పల్లకి సేవ లక్ష్మి గణపతి మృత్యుంజయ హోమములు పల్లకి ఊరేగింపు కార్యక్రమం గురువుల సత్కారములు భజన బృందములచే భజనలు భక్తుల కోలాటములు నృత్య ప్రదర్శనలు అతి వైభవంగా అంగరంగ వైభవముగా సన్మానములు ముఖ్యఅతిథి రిటైర్డ్ మేజిస్ట్రేట్ తరిగొప్పుల మహేందర్ గారు తరిగొప్పుల అమరేందర్ గారూ విచ్చేశారు వేద పండితులు పవన్ పంతులు గారి ఆధ్వర్యంలో ఆశీర్వచనములు భక్తులకు తీర్థ అన్న ప్రసాదములు అతిగనముగా అందజేయబడినది అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు చైర్మన్ జి వి ఎస్ ఎస్ శర్మ జనరల్ సెక్రెటరీ కె లక్ష్మారెడ్డి కొమరయ్య



గణపతి రెడ్డి వీరాస్వామి రామకృష్ణ పాపిరెడ్డి రఘురాం రెడ్డి జ్యోతి రెడ్డి అడ్వకేట్ పి పి మల్లారెడ్డి మహేందర్ కుమార్ విగ్నేశ్వర్ శశికళ శేషు రవిరాజు మనోహర్ అనిత కోటేశ్వర్ రవి సత్తిపండు సాయి కృష్ణ సుజాత ఉమారాణి చిన్ని సహస్ర చాలామంది భక్తులు పిల్లలు పెద్దలు కాలనీవాసులు విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొని బాబా కృపకు పాత్రులయ్యారు

# వివేరా హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్



**ప్రజా స్వేచ్ఛ-ఎల్బీనగర్ ప్రతినిధి:**

నిరుపేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే సంకల్పంతో హయత్ నగర్ వివేరా హాస్పటల్ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు,రంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు కళ్లెం సుజాత రెడ్డి సారధ్యంలో హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీ బంజారా భవన్ లో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హయత్ నగర్ వివేరా హాస్పటల్ వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపుకు వచ్చిన రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళ్లెం సుజాత రెడ్డి మాట్లాడుతూ హయత్ నగర్ వివేరా హాస్పటల్ చైర్మన్ వీర పేద ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులను పరిసర ప్రాంతాల కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళ్లెం కిషోర్ రెడ్డి, వివిధ హాస్పటల్ సిబ్బంది ఉపేందర్ గౌడ్, నాగబాబు గౌడ్, రిత్విక్ చౌదరి,అభిషేక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా లేకుంటే ఆ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని దోచేస్తారు..




**ప్రజా స్వేచ్ఛ సిద్దిపేట**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత పది సంవత్సరాల పాలనలో ప్రజల్నే కాదు దేవుళ్లను సైతం మోసం చేశారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కొమురవెల్లి మల్లన్న ఆలయ నిధులతోపాటు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు సైతం దోచుకొని పోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా లేకుంటే ముత్తిరెడ్డి లాగానే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైతం నియోజకవర్గాన్ని దోచుకుంటారని అన్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని చేర్యాలలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలను జనగామ జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలని మల్లన్న పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీగా చేర్యాల, కొమురవెల్లి ప్రాంతాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారు..

# ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ అవగాహనా రాహిత్యాన్ని బయట పెట్టుకున్నారు..

**ప్రజా స్వేచ్ఛ సిద్దిపేట**



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్ల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ నిధులను ఎక్కువగా ఖర్చుపెట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. శనివారం రోజున ఢిల్లీలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆయన చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు ఖండించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..” మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజకీయ విమర్శలు కట్టిపెట్టి కాళేశ్వరాన్ని పునర్ వినియోగంలోకి తేవడంపై శ్రద్ధ పెట్టాలి. ఢిల్లీ వేదికగా ఆయన తన అవగాహనా రాహిత్యాన్ని బయట పెట్టుకున్నారు. మేడిగడ్డ వద్ద అన్ని చర్యలు తీసుకున్నామని అంటూనే మట్టి పరీక్షలు సాధ్యపడలేదని చెప్తున్నారు. వరద రాకముందే సాంకేతిక పరీక్షలు పూర్తి చేయకపోవడానికి NDSA నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యమే కారణం. వరదల దృష్ట్యా పరీక్షలు ఆపేశామని చెప్పడం బాధ్యత రాహిత్యానికి నిదర్శనం కాదా?. రక్షణ కోసం సూచనలు చేయడంలో NDSA దారుణంగా విఫలం అయింది. నివేదికను తెప్పించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. మేడిగడ్డ బ్యారేజీకి ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత. తుమ్మిడి హట్టి వద్ద కొత్త ప్రాజెక్టు కడతామని మంత్రి ఉత్తమ్ చెప్తున్నారు. తుమ్మిడి హట్టిలో బ్యారేజీ ఏ ఎత్తు వద్ద కడతారో చెప్పాలి. 152మీటర్ల వద్ద కట్టాలని భావిస్తే ముందు మహారాష్ట్రను ఒప్పించాలి. ఆనాడు మహారాష్ట్రను ఒప్పించలేక పనులు చేయకుండా వదిలేసింది ఎవరు? ఆ వైఫల్యం మీది కాదా?. తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజీ కట్టినా లిఫ్ట్ లేకుండా ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు వెళ్లవని ఉత్తమ్‌కు తెలీదా?” అని అన్నారు..

